క్లుప్తంగా

బీసీజీ వ్యాక్సిన్ సురక్షితం



కామినేనిపల్లెలో వృద్ధులకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

శిరివెళ్ల: బీసీజీ వ్యాక్సిన్ పెద్ద వారికి సురక్షితమని సీహెచ్ఓ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం కామినేనిపల్లెలో 70 మందికి వైద్య సిబ్బంది బీసీజీ వ్యాక్సిన్ వేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం గ్రామ సచివాలయాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 1,260 మంది పెద్దలకు వ్యాక్సిన్ వేశామని, 60 ఏళ్లు దాటిన వారందరికీ వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు. 2025 నాటికి టీబీ కేసులను తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఉన్నారు.

వంటలు రుచికరంగా వండాలి



రుద్రవరంలో వంటలను రుచి చూస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వంటలు రుచికరంగా వండాలని మధ్యాహ్న భోజన ట్రైనర్లు పార్వతి, రామలక్ష్మి తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం వారు మండలంలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వాహకులతో సోమవారం నుంచి శనివారం వరకు మెనూ ప్రకారం వంటలు చేయించి తిని రుచి చూశారు. ఇక్కడ చేసిన విధంగానే విద్యార్థులకు వండి పెట్టాలని చెప్పారు. ఎంఈఓలు కోటయ్య, లక్ష్మి, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

వేసవి శిబిరాలతో విద్యార్థులకు మేలు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): వేసవి శిబిరాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, సృజనను వెలికితీయవచ్చని శ్రీ గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తమ విద్యాసంస్థల ప్రాంగణంలో విద్యార్థుల కోసం ఉచితంగా వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. ఇందులో దస్తూరి, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, శాస్త్రీయ జానపద, ఆధునిక నృత్యం, పెయింటింగ్, డ్రాయింగ్,హస్తకళలు, వ్యక్తిత్వ వికాసం కోసం ప్రత్యేక తరగతులు, కరాటే, తైక్వాండో వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు.

ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని ఎస్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మౌలాలి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్ కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలని, 1998, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులను మినిమం టైంస్కేల్ పద్ధతిలో ఉద్యోగంలో చేర్చుకున్నారని, వెంటనే వారిని రెగ్యులర్ టీచర్లుగా నియమించాలన్నారు. అలాగే..మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గోపాలకృష్ణ, నాగేంద్రకుమార్, శ్రీనివాసలు, శ్రీనివాసరెడ్డి, నరసింహారావు, ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న డేవిడ్

చాగలమర్రి: మండలంలోని నగళ్లపాడు గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోడుమూరుకు చెందిన డేవిడ్ అనే యుడకుడికి గాయలయ్యాయి. వివరాలు.. కోడుమూరు పట్టణానికి చెందిన డేవిడ్ సొంత పనుల నిమిత్తం తన పల్సర్ మోటార్ సైకిల్‌పై కడపకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నగళ్లపాడు సమీపంలో డివైడర్‌పై నుంచి అకస్మాత్తుగా వచ్చిన కుక్క బైక్‌ను ఢీ కొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన డేవిడ్‌ను గ్రామస్తులు 108 వాహనంలో చాగలమర్రిలోని కేరళ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడికి ప్రథమ చికిత్స అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు.

నాపేరు నర్సిరెడ్డి. మాది దొర్నిపాడు. నా కుమార్తె పవిత్రను గతేడాది పదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో చేర్పించాను. ఎందుకంటే ఉన్నత చదువులు ఇంగ్లిష్ మీడియంలో చదవడానికి పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. అలా నా కూతురు ఇబ్బంది పడరాదని, అందుకు పదిలోనే ఇంగ్లిష్ మీడియం చదివితే అక్కడ సులభతరమవుతుందని గ్రహించా. ఇక ప్రభుత్వం కూడా చొరవతో ఆంగ్ల మాధ్యమం అమలు చేసిన విధానంతో నాకు ధైర్యం వచ్చింది. ఆ తరువాత పది ఫలితాల్లో పవిత్ర 575 మార్కులు సాధించి తాలూకా టాపర్‌గా నిలిచింది. ఇక ఇంటర్ ఇంగ్లిష్ మీడియంలో తడబాటు గురికాకపోవడంతో ఎంపీసీలో 470 మార్కులకు 463 మార్కులు సాధించింది. ఇదంతా కేవలం జగనన్న సర్కారు తీసుకొచ్చిన నూతన విద్యావిధానంతోనే సాధ్యమైంది.



నాపేరు ప్రవీణ్ కుమార్. దొర్నిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో చదివాను. ప్రభుత్వ పాఠశాలలపై కార్పొరేట్ పాఠశాల విద్యార్థులకు చిన్నచూపు ఉంది. కానీ ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం అద్భుతం. కార్పొరేట్ పాఠశాలలు తలదన్నేలా మా టీచర్లు బోధించిన తీరు బాగుంది. ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చదివాం. ఇంగ్లిష్ మీడియంలోనే పదవ తరగతి పరీక్షలు రాసి 544 మార్కులు సాధించి మా పాఠశాల టాపర్‌గా నిలిచినందుకు గర్వంగా ఉంది.



ఆంగ్లంలో అదరగొట్టారు

- ప్రభుత్వ పాఠశాలల్లో పది ఫలితాల్లో ఇంగ్లిష్ మీడియం విద్యార్థుల సత్తా
- ఫలించిన ప్రభుత్వ విద్యావిధానం

పేద విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తెలుగు మీడియానికే పరిమితం కాకుండా ఆంగ్ల మాధ్యమంలో రాణించాలని, వారి ఉన్నత చదువులకు ఇది ఉపయోగపడుతుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనక్కి తగ్గకుండా ప్రవేశపెట్టడంతో విద్యార్థులు కూడా ఉత్తమ మార్కులతో సత్తా చాటి కార్పొరేట్ అభ్యాసకులకు ఏమాత్రం తీసిపోమని నిరూపించారు.

దొర్నిపాడు: తమది చేతల ప్రభుత్వమని పలు సందర్భాల్లో చాటి చెప్పింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఇందుకు మరో ఉదాహరణ ప్రభుత్వ నూతన విద్యా విధానం. పేదలకు చదువే గొప్ప ఆస్తి అని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చారు. ఉన్నత చదువులకు తెలుగు మీడియం కాస్త అడ్డువస్తుందని వెంటనే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో తమ బిడ్డలను చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. అలాగే ప్రభుత్వం విద్యను బలోపేతం చేసేలా డిజిటల్ వైపు అడుగులు వేయడంతో ప్రభుత్వ పాఠశాలలు అనేక మందిని ఆకర్షిస్తున్నాయి. ఓ పక్క ప్రతిపక్షాలు పేదవాడి చదువుకు అడ్డుపడుతున్నా, ఇంగ్లిష్ మీడియం అమలు చేయకుండా అడ్డంకులు సృష్టించినా లెక్క చేయకుండా పేదల విద్యకు పెద్దపీట వేశారు. ఇంకేముంది ఇంగ్లిష్ మీడియం అమలు కావడంతో విద్యార్థులు పది ఫలితాల్లో ఉత్తమ మార్కులతో అదరగొట్టారు.

పదిలో మెరిసిన నవరత్నాలు..

స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 132 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 115 మంది ఉత్తీర్ణులై 87శాతం ఫలితం సాధించారు. వారిలో 9మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. వీరంతా ఇంగ్లిష్ మీడిలోనే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాశారు. ప్రవీణ్‌కుమార్ (544), వైష్ణవి(538), వెంకటభానుప్రసాద్(535), రుక్సాన(519), పావణి(518), కుల్లాయమ్మ(509),ప్రకాశ్(506), వాసు(506), మాధవీ(500), సలీమ(518) సాధించి పాఠశాలలో నవరత్నాలుగా మెరిశారు.



దొర్నిపాడు ఉన్నత పాఠశాల

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాలు ఇలా..

పాఠశాల	మీడియం	విద్యార్థుల సంఖ్య	ఉత్తీర్ణత సాధించిన వారు	ఉత్తర్ణత శాతం
జెడ్పీ ఉన్నత పాఠశాల (దొర్నిపాడు)	ఇంగ్లిష్	132	115	87.17
జెడ్పీ ఉన్నత పాఠశాల(భాగ్యనగరం)	తెలుగు	48	46	95.83
జెడ్పీ ఉన్నత పాఠశాల(డబ్ల్యూకొత్తపల్లె)	తెలుగు	25	25	100.00
కేజీబీ విద్యాలయం (అమ్మిరెడ్డినగరం)	ఇంగ్లిష్	25	24	96.00

పై తరగతులకు ఎంతో ఉపయోగం



ప్రైవేటు పాఠశాల్లో చేరి చదువుకునే స్థోమత మాకు లేదు. అయినా వారి కంటే మేం ఏం తక్కువ కాదని పట్టుదలతో ఆంగ్ల మాధ్యమంలోనే పదవ తరగతి పరీక్షలు రాశాము. నాకు 538 మార్కులు వచ్చాయి. మొదటి నుంచి ఇంగ్లిష్ మీడియం చదువులు పెట్టడం వల్ల పై తరగతులకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఇక్కడ తెలుగులో చదివినా ఇంటర్, టెక్నికల్ చదులు తప్పనిసరిగా ఇంగ్లిష్‌లోనే చదవాలి. కావున పదిలోనే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో మాకు ఉన్నత చదువుల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– వైష్ణవి, దొర్నిపాడు

పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం



సర్కారు బడిలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టడం పేద విద్యార్థులకు సువర్ణ అవకాశంగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే రూ.లక్షలు చెల్లించి కార్పొరేట్ పాఠశాలల్లో చదివే దానికంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నైపుణులైన ఉపాధ్యాయులు ఇంగ్లిష్‌లో బోధన సాగిస్తున్నారు. తెలుగు మీడియంతో ఉన్నత చదువుల్లో రాణించేందుకు గ్రామీణ పేద విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఈసారి పది ఫలితాల్లో ఆంగ్లమాధ్యమం విద్యార్థులు సత్తా చాటారు.

–అబ్దుల్ కరీం, ఎంఈఓ, దొర్నిపాడు

ఏదైనా సాధిస్తామనే ధైర్యం వచ్చింది



మొదట ఇంగ్లిష్ మీడియంలో చేరాలంటే భయమేసింది. సరిగ్గా చదవ లేకపోతే మార్కులు తక్కువ వసాయని ఆందోళన చెందా. మా అమ్మనాన్నలు కూడా భయపడ్డారు. ప్రభుత్వం తెచ్చిన విద్యావిధానం మాలో స్ఫూర్తి నింపింది. వెంటనే ఇంగ్లిష్ మీడియంలో చదువుతానని పేరు ఇచ్చాను. పరీక్షల్లో 535 మార్కులు సాధించి పాఠశాల టాప్ త్రీలో నిలిచాను. ఫలితాలను చూశాక ఏదైనా సాధిస్తాననే ధైర్యం వచ్చింది.

–వెంకట భానుప్రసాద్, దొర్నిపాడు

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక గాంధీ చౌక్‌లో లారీ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అలాగే మున్సిపల్ కార్యాలయం, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో జెండా ఎగురవేసి ఉత్సవాలు జరుపుకున్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతా మహానగరంలో సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ, పేదల పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. తోట మద్దులు, వెంకటలింగం, సుబ్బారావు, భాస్కరాచారి, పవన్, కరిముల్లా, నాగరాజు, అంజి, వీరన్న పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం చూపాలి



పైపులైన్ లీకేజీలను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ

నంద్యాల (అర్బన్): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పంచాయతీల్లో నెలకొన్న తాగు నీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు తెలిపారు. గత వారం రోజులుగా మండలంలోని బిల్లలాపురం గ్రామ ఎస్సీ కాలనీ వాసులు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారనే సమాచారంతో గురువారం గ్రామ నాయకులు వెంకటసుబ్బయ్య, సచివాలయ సిబ్బందితో కలిసి పైపులైన్ లీకేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజల నీటి అవవసరాలు తీర్చాలన్నారు. లీకేజీల మరమ్మతులు ఆలస్యమయ్యే పరిస్థితి ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టాలని సూచించారు. రెండు రోజుల్లోగా కాలనీలో నీటి సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.



దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అక్రమ మద్యం స్వాధీనం

చాగలమర్రి: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని నుంచి 60 మద్యం బాటిళ్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రమణ్య తెలిపారు. స్థానిక రిక్వెస్ట్ స్టాప్ వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా గొడిగనూరు గ్రామానికి చెందిన పగిడాల సత్యనారాయణకు చెందిన ఏపీ39కెటి 6819 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న 60 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని చెప్పారు. బైక్, మద్యం సీజ్ చేసి, కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.





పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్, మద్యం

ఘనంగా గంధోత్సవం

చాగలమర్రి: స్థానిక పెద్దమకానం వీధిలో వెలసిన దస్తగిరి స్వామి, బందెషావలి స్వామి, షాబుషావలి స్వాముల వారి గంధం కార్యక్రమాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ జిల్లా, కమలాపురం దర్గా–ఏ–గఫ్ఫారియా ఖలీఫా మౌలానా ఫైజుల్ ఖాదర్ షా ఖాద్రీ స్వామి పాల్గొన్నారు. ఫక్కీర్ల విన్యాసాలు, మేళతాళాలతో, భారీగా తరలి వచ్చిన భక్తుల సమక్షంలో ఊరేగింపుగా గంధాన్ని స్థానిక ఖిలా మస్జిద్ నుంచి స్వామి దర్గాకు చేర్చారు. మౌలానా స్వామి వారికి గంధం సమర్పించారు. అనంతరం ప్రత్యేక ఫాతేతెహాలు సమర్పించి కార్యక్రమాన్ని ముగించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

మహానంది: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పనులు చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. గాజులపల్లె సమీపంలోని బుచ్చమ్మతోపు గ్రామంలో గురువారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ మేరకు ప్రతి ఇంటిలో సోదాలు నిర్వహించారు. అనంతరం ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో మురాద్ వలి ఉరుసు

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో మురాద్ వలి స్వామి ఉరుసు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గతంలో ఉన్న దర్గా శిథిలం కావడంతో గ్రామస్తులంతా కులమతాలకు అతీతంగా విరాళాలు పోగు చేసుకొని నూతన దర్గా నిర్మించారు. ప్రస్తుతం నూతన దర్గాలో ఉరుసు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. మొదటి రోజు గురువారం గ్రామస్తులంతా స్వామి వారికి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దర్గా నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.



ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కొలనుభారతి అమ్మవారికి ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామ శివారుల్లోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతి దేవి ఆలయంలో సరస్వతి దేవి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం చైత్రమాసం శుక్ల పక్షము వసంతరుతువు వైశాఖమాసం సప్తమి రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సరస్వతి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేషపూజలు చేశారు. చిన్నారులకు భక్తిశ్రద్ధలతో, మంచి విద్యాబుద్ధులు ప్రాప్తించాలని ఆలయ పురోహితులు బీజాక్షరాలు దిద్దించి 12 మంది చిన్నారులకు కుటుంబ సమేతంగా అక్షరాభ్యాసకార్యక్రమాలు నిర్వహించారు.



సాముహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రైవేట్ బోధన.. ఉపాధ్యాయుల రోదన

- టార్గెట్ల పేరుతో ప్రైవేట్ విద్యాలయాల యాజమాన్యాల వేధింపులు
- అడ్మిషన్లు చేయకపోతే జీతం కట్
- మండుటెండలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్న టీచర్లు
- చెప్పింది చేస్తేనే ఉద్యోగం ఉంటుందని హెచ్చరికలు



నంద్యాల(న్యూటౌన్): ఉన్నత చదువులు చదివారు.. బోధనపై మక్కువతో సంబంధిత కోర్సులు పూర్తి చేసి ఈ రంగంలోకి అడుగుపెట్టారు. పరిస్థితులు సహకరించకపోవడంతో ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా చేరారు. అంతే.. అక్కడి నుంచి వారి జీవితం వారి చేతుల్లో లేకుండా పోయింది. నిత్యం వేధింపులు.. చెప్పిన పని చేసినా ఉద్యోగం ఉంటుందో లేదోనని ఆందోళన.. ఉదయం వెళ్తే రాత్రి ఎప్పుడో ఇంటికి వెళ్తున్నారు. ఇక వ్యక్తిగత జీవితం పూర్తిగా ఆయా పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు లాగేసుకున్నాయి. ప్రస్తుతం పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో వేసవి సెలవులు ముగిసిన మురుసటి రోజు నుంచి ఉపాధ్యాయులకు అడ్మిషన్ల టార్గెట్ ఇచ్చారు. అవన్నీ పూర్తి చేయడమే కాకుండా ప్రస్తుతం ఉన్న విద్యార్థులు ఫీజు రెన్యూవల్ చేయించడం, పుస్తకాలు, యూనిఫాం కొనుగోలు చేసేలా తల్లిదండ్రులను పురమాయించాలి. ఇలా బోధన ఒక్కటే కాకుండా ఇవన్నీ చేస్తేనే వారి ఉద్యోగం ఆ రోజు వరకు ఉంటుంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధనేతర పనులే అధికం.

ఎండలో ఇంటింటికీ తిరిగి..

వేసవి సెలవుల్లో కూడా వారు విధుల్లో ఉంటున్నారు. ఎర్రటి ఎండల్లో ఇంటింటికీ తిరుగుతున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి మీ ఇంట్లో చదువుకునే పిల్లలు ఉన్నారా... ఏం చదువుతున్నారు.. మా పాఠశాలలో, కళాశాలలో చేర్పించండి అంటూ ప్రాధేయపడుతున్నారు. ఇచ్చిన అడ్మిషన్ల టార్గెట్లు పూర్తి చేస్తేనే సెలవుల్లో జీతాలు ఇస్తామని కొన్ని కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలు పెడుతున్నాయి. ఒక్కొక్కరు కనీసం 10 నుంచి 15 మంది పిల్లలను పాఠశాలలో చేర్పించాలి. అలా చేర్పించిన తర్వాత కూడా సెలవుల అనంతరం పాఠశాల తెరిచిన తరువాత ఉద్యోగం ఉంటుందో, లేదో గ్యారంటీ లేదు. ఇచ్చే అరకొర జీతాలు నిలిపివేస్తారనే భయంతో ఉపాధ్యాయులు, సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. ఒకవేళ లక్ష్య సాధనలో వెనకబడితే బాస్ మాట్లాడే భాష ఇబ్బంది పెట్టేలా ఉంటుందని, పలువురు వాపోతున్నారు.

ఎవరికీ చెప్పుకోలేక..

నంద్యాల జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు 526 ఉన్నాయి. ఇందులో ప్రైమరీ 166, యూపీ 178, హైస్కూళ్లు 182 ఉన్నాయి. దాదాపు 10 వేల మంది ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తుండగా 2 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఒకవైపు బోధన...మరోవైపు టార్గెట్ పూర్తిచేసే పనిలో ప్రైవేటు, కార్పొరేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీవ్ర ఒత్తిడికి లోనై మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పడుతున్నారు. ఏప్రిల్ నెల నుంచే అడ్మిషన్లు కోసం వేట సాగించాల్సి ఉంటుంది. తమ వేదనను ఎవరికీ చెప్పుకోలేక లోలోపల కుమిలి పోతున్నారు. చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న సమయంలో ఉన్న ఉద్యోగాన్ని వదులుకోలేక.. అక్కడే ఉండలేక ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పడుతున్న బాధలు వర్ణనాతీతం.

ప్రణాళికలతో సాగు.. పంటలు బాగు

- భూసార ఫలితాల ఆధారంగా పంట సాగు చేయాలి
- ముందస్తు జాగ్రత్తలతో లాభాలు
- విత్తన శుద్ధితోనే తెగుళ్ల నివారణ
- సేంద్రియంతో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుముఖం



చాపిరేవుల గ్రామంలో విత్తన సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

నంద్యాల(అర్బన్): ముందస్తు ప్రణాళికలతో పంటలు సాగు చేస్తే ఆశించిన దిగుబడులు వస్తాయని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుండటంతో పంటల సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా సుమారు 7,468 హెక్టార్లలో వరి, మినుము, పత్తి, మొక్కజొన్న సాగయ్యే అవకాశం ఉంది. కేసీ కెనాల్, తెలుగు గంగ, ఎస్సార్బీసీ, కుందూ నదితో పాటు, బావుల కింద వరి పైరును దాదాపు 4,673 హెక్టార్లలో సాగు చేయనున్నారు. ముందస్తుగా వర్షాలు కురవడంతో పాటు, సకాలంలో ప్రభుత్వం నుంచి పచ్చిరొట్ట ఎరువులు, విత్తనాలు అందండంతో ఇది వరకే లోతు దుక్కులు చేసుకున్న రైతులు సాగుకు ఏర్పాటు చేసుకుంటున్నారు.

భూసారాన్ని బట్టి పంట వేసుకోవాలి..

ఖరీఫ్‌నకు ముందే ప్రతి రైతు భూసార పరీక్ష చేయించుకోవాలి. వాటి ఫలితాల ఆధారంగా అనుకూలమైన పంటలను మాత్రమే వేసుకోవాలి. దీని వల్ల రైతులకు పెట్టుబడి తగ్గి, దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. భూసారానికి అనుగుణంగా ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలి. అలాగే రైతులు అంతర, సరిహద్దు పంటలపై దృష్టి సారించాలి.

విత్తన శుద్ధి..

పంటల సాగులో నాణ్యమైన విత్తన ఎంపిక, విత్తన శుద్ధి కీలకం. పంటల సాగు కోసం రైతులు వివిధ ప్రాంతాల నుంచి విత్తనాలను సేకరిస్తారు. ఈ విత్తనాల ద్వారా శిలీంద్రాలు, బ్యాక్టీరియా, పురుగులు పంట మొలకెత్తినప్పుడు ఆశించి నష్టం చేకూర్చుతాయి. అంతేకాకుండా విత్తనం ద్వారా వ్యాపించి తెగుళ్లలో మొలక శాతం తగ్గి శిలీంద్రాల వల్ల పైరు కుళ్లిపోయే అవకాశం ఉంది. విత్తన శుద్ధి చేయడం వల్ల ప్రారంభ దశలో తెగుళ్లు, వ్యాధుల బారిన పడకుండా రక్షణ కవచంగా పనిచేస్తుంది.

సేంద్రీయ ఎరువులతో మేలు..

ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలి. ఎక్కువగా రసాయన ఎరువుల వాడకం వల్ల పంట దిగుబడిలో సమస్యలు ఎదురవుతాయి. పశువుల ఎరువులు, వర్మీకంపోస్టు ఎరువుల ద్వారా భూసారం పెరగడంతో పాటు నాణ్యమైన దిగుబడిని సాధించవచ్చు.

మోతాదులోనే ఎరువులు వాడాలి..

రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులను సరిగ్గా పాటించాలి. భాస్వరం, తదితర ఎరువులను దుక్కిలో వేసుకోవాలి. నత్రజని, ఎరువులను విడతల వారీగా వేసుకోవాలి. పంటకు వేయాల్సిన పొటాషియాన్ని సగం దుక్కిలో, సగం పంటకు వేయాలి. యూరియాను నేరుగా కాకుండా వేప పిండితో కానీ, బంక మట్టితో కానీ కలిపి వేయాలి. ఇలా వేసుకుంటే యూరియా ఆవిరి కాకుండా ఉండటంతో పాటు వంద శాతం పంటకు ఉపయోగపడుతుంది.

భూసార ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి

భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేసి ఎరువులు, మందులు వాడాలి. నాణ్యమైన విత్తనాలు వాడి, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. అనవసరంగా ఎరువులు, మందులు వాడరాదు. ముఖ్యంగా సేంద్రియ ఎరువులు చల్లితే రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులు విత్తనం వేయడానికి ముందు విత్తనశుద్ధి చేపట్టాలి. అప్పుడే తెగుళ్లను నివారించవచ్చు.

– లోకేశ్వరరెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారి